క్లుప్తంగా

బేస్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



కేసముద్రం: మండలంలోని కల్వల మోడల్ స్కూల్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(శాట్), జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో బేస్‌బాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ బాస్కెట్ బాల్ కోచ్ వెలిశాల కుమారస్వామి మాట్లాడుతూ.. విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకుని క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కల్లూరి ప్రభాకర్, ఉప్పాల సంజీవరావు, పీఈటీ లలిత పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



తొర్రూరు రూరల్: మండలంలోని అమర్‌సింగ్ తండా, భీముడు తండా, కాళిగూడెం, అరిపిరాల గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై బుధవారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఎన్నికల వ్యయ పరిశీలకుడు దిలీబన్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన 83 కేసులు నమోదు కాగా, 858 లీటర్ల నాటుసారా, 52,350 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి, 1550 కేజీల బెల్లం, 233 లీటర్ల మద్యం, 15వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు నాగేందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, నాగేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపులో చోరీ

గూడూరు: మండలంలోని గుండెంగ గ్రామంలోని వెంకటేశ్వర వైన్స్ షాపులో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై సీహెచ్. నగేష్ బుధవారం తెలిపారు. వివరాల ప్రకారం వైన్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది, కౌంటర్‌పై ఉండే వ్యక్తి మంగళవారం రాత్రి షాపునకు తాళం వేసి వెళ్లారు. అదే రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షాపునకు పడమర దిక్కున గల గోడకి రంధ్రం చేసి లోనికి ప్రవేశించారు. అందులోని డీవీఆర్, కౌంటర్‌లోని రూ.16,200 నగదుతోపాటు సుమారు రూ.48వేల విలువ చేసే మద్యం దొంగిలించుకుపోయారు. ఈవిషయంపై షాపులో పనిచేస్తున్న వంటల చంద్రమోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



తొర్రూరు రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు జాటోతు సుజాత రాజేందర్ దంపతులు, కొంత మంది నాయకులు, కార్యకర్తలు ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ సమక్షంలో మళ్లీ బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు సోమేశ్వర్‌రావు, లింగన్నగౌడ్, సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

అన్నిదానాల్లో రక్తదానం మిన్న



మహబూబాబాద్: అన్నిదానాలలో కెల్లా రక్తదానం మిన్న అని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మురళీధర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా తనతోపాటు తన తల్లి యాళ్ల పుష్పలత, పలువురు అవయవ దానం చేసేందుకు ముందుకు వచ్చారు. తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల సంఘం జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్‌రెడ్డికి అంగీకార పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో చిట్యాల జనార్దన్, శంకర్, గోపి, శివకుమార్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా మే డే వేడుకలు

మహబూబాబాద్ అర్బన్: మే డే వేడుకలు నిర్వహిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు



మరిపెడ: జెండా ఎగురవేసి నినాదాలు చేస్తున్న నాయకులు



నెహ్రూసెంటర్: మే డే వేడుకల్లో పాల్గొన్న ఇఫ్టూ నాయకులు



డోర్నకల్: సీపీఐ ఆధ్వర్యంలో జెండా ఎగురవేస్తున్న నాయకులు



తొర్రూరు: మేడే వేడుకల్లో పాల్గొన్న ఆర్టీసీ కార్మిక నాయకులు



ప్రపంచ కార్మిక దినోత్సవం పురస్కరించుకొని బుధవారం సీపీఐ, ఏఐటీయూసీ, సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎర్రజెండాలను ఆవిష్కరించి, గ్రామాల్లో డప్పుచప్పుళ్లతో ఊరేగింపు చేస్తూ, కార్మిక అమరవీరుల ఆశయాలు సాధించాలంటూ నినాదాలు చేస్తూ సంబురాలను జరుపుకున్నారు. హక్కుల రక్షణ కోసం కార్మిక రంగం సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. - సాక్షి నెట్‌వర్క్



నెల్లికుదురు: ఆలేరు గ్రామంలో..



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లి గ్రామంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో..



పెద్దవంగర: చిట్యాల గ్రామంలో..



తొర్రూరు రూరల్: గుర్తూరులో..



కురవి: సీపీఐ ఆధ్వర్యంలో..



మరిపెడ రూరల్: ధారావత్‌తండాలో..



నర్సింహులపేట: బందం చెరువులో..



గార్ల: వేడుకల్లో పాల్గొన్న నాయకులు



చిన్నగూడూరు: మండల కేంద్రంలో..



కేసముద్రంలో..



దంతాలపల్లిలో..



బయ్యారంలో..

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నర్సింహులపేట: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు, పేదలు, మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సమావేశాల్లో మండల కమిటీ అధ్యక్షుడు జినుకల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్, వెన్నం రవీందర్‌రెడ్డి, సురేష్, మహిపాల్‌రెడ్డి, రమేష్, రామకృష్ణ, రజినీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్, అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.

బలరాంనాయక్ గెలుపే లక్ష్యం

గూడూరు: పార్లమెంట్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ, పీఏసీఎస్ చైర్మన్ చల్ల లింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేం శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎండి.యాకూపాష, మాధవపెద్ది అమరేందర్‌రెడ్డి, కంకటి ఉప్పలయ్య, పెసరి శివ పాల్గొన్నారు.



నర్సింహులపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

బీజేపీని ఓడించాలి

గార్ల: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు బీజేపీ ఎంపీ అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించాలని ఇల్లెందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు రవి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తాళ్లపల్లి కృష్ణగౌడ్, శంషాద్‌బేగం, జర్పుల పృథ్వీనాయక్ పాల్గొన్నారు.

కురవి: బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్‌రావు, రాజేందర్‌కుమార్, బానోత్ తుకారాంనాయక్, వీరన్న, భద్రయ్య పాల్గొన్నారు.

'సస్పెండ్ అయిన వారిని పార్టీలో చేర్చుకునేది లేదు'

గూడూరు: గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని పార్టీ క్రమశిక్షణ సంఘం సస్పెండ్ చేసిందని, అలాంటి వారిని తిరిగి కాంగ్రెస్‌లో చేర్చుకునేది లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టె వెంకన్న అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మాజీ సర్పంచ్ నూనావత్ రమేష్ తిరిగి కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రచారం చేసుకుంటున్నారని, ఆయన చేరికను పార్టీ డీసీసీ చైర్మన్ చిన్నారెడ్డి, జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ అంగీకరించలేదన్న విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్‌రెడ్డి, బొల్లికొండ మధుగౌడ్, వాంకుడోతు కొమ్మాలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై విస్తృత ప్రచారం

డోర్నకల్: ఓటు హక్కు వినియోగంపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే వారిని కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్దకు తీసుకెళ్లి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ వీరన్న, ఆర్‌ఐ రామా పాల్గొన్నారు.

అభివాదం చేసుకుంటూ మానుకోటకు కేసీఆర్



బయ్యారం: బస్సులో నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం కేసీఆర్



కురవి: గిరిజనులతో కలసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

బయ్యారం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనను ముగించుకొని మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోకి ప్రవేశించిన మాజీ సీఎం కేసీఆర్ ఇల్లెందు–మహబూబాబాద్ రహదారిపై తన కోసం వేచి ఉన్న ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు వెళ్లారు. మండలంలోని నామాలపాడు, కొత్తపేట, గంధంపల్లి, బయ్యారంలో ప్రజలు కేసీఆర్ రాక కోసం సాయంత్రం నాలుగు గంటల నుంచే ఎదురు చూశారు. కాగా 6గంటలకు మండలంలోకి ప్రవేశించిన కేసీఆర్ బస్సు కాన్వాయ్ 15 నిమిషాల్లో మండలంలో నుంచి బయటకు వెళ్లింది. ఈ సందర్భంగా బయ్యారంలో పెద్ద సంఖ్యలో వేచి ఉన్న ప్రజలకు కేసీఆర్ బస్సులో నుంచి అభివాదం చేశారు.

కేసీఆర్‌కు ఘన స్వాగతం

కురవి: మాజీ సీఎం కేసీఆర్ మానుకోట పర్యటకు వస్తున్న క్రమంలో మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) శివారు పెద్దతండా జీపీ పరిధిలోని భద్రాచలం ప్రధాన రహదారిపై కేసీఆర్‌కు ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ బుధవారం సాయంత్రం 6.45 గంటలకు ఘన స్వాగతం పలికారు.

మానుకోటకు తరలిన నాయకులు

చిన్నగూడూరు/ మరిపెడ రూల్: మహబూబాబాద్‌లో బుధవారం నిర్వహించిన కేసీఆర్ కార్నర్ మీటింగ్‌కు బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో కార్యకర్తలు అశోక్, శ్రీను, అంజి, షాంకార్, విజయ్, మాజీ సర్పంచ్ బానోతు పార్వతిమంగిలాల్, మామిడాల మునేష్, మాజీ సర్పంచ్ దుస్స నర్సయ్య, అజ్మీర రెడ్డి, తదితరులు ఉన్నారు.

నిప్పంటుకొని గడ్డివాములు దగ్ధం



మరిపెడ రూరల్: గడ్డివాముకు అంటుకున్న మంటలను ఆర్పుతున్న రైతులు

మరిపెడ రూరల్: నిప్పంటుకొని పలువురి రైతుల గడ్డి వామిలతో పాటు కల్లంలో ఆరబోసిన 16 బస్తాల వరి ధాన్యం దగ్ధమై సుమారు లక్ష రూపాయలు నష్టం వాటిల్లింది. ఈ సంఘటన మరిపెడ మండలం అజ్మీరతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ధక్నాతండాలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ధక్నాతండాకు చెందిన గిరిజన రైతులు బానోతు సైదా 150 గడ్డిమోపులు, బానోతు దస్రు 150 గడ్డి మోపులు, శివకు చెందిన 80 గడ్డి మోపులను వీరంత తండా శివారుల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో గడ్డి వాములను పేర్చుకున్నారు. అదేవిధంగా బానోతు రత్యా 12 బస్తాల ధాన్యం, శివ 4బస్తాల వరి ధాన్యం కల్లంలో ఆరబోసుకున్నారు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తి వరి కొయ్యలకు నిప్పుపెట్టడంతో మంటలు వ్యాపించి అక్కడ సమీపంలో ఉన్న గడ్డి వాములు అంటుకున్నాయి. ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేయగా నర్సింహులపేటలో ఉన్నట్లు సిబ్బంది సమాచారం ఇచ్చారు. మరిపెడ ఫైర్ స్టేషన్‌లో మరో ఇంజన్ ఉన్నప్పటికీ అది పనిచేయడం లేదన్నారు. దీంతో రైతులు చేసేది లేక స్థానిక గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా మంటలు చల్లార్చే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ 380 గడ్డిమోపులతోపాటు 16 బస్తాలు కల్లంలో ఆరబోసిన ధాన్యం కాలిబూడిదయ్యాయని సుమారు రూ.లక్ష రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమయానికి ఫైర్ ఇంజన్ అందుబాటులో లేక పోవడంతో గిరిజన రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాప్లీతండాలో..

బయ్యారం: మండలంలోని బాలాజీపేట పంచాయతీ పరిధిలోని పాప్లీతండాలో బుధవారం ఆరు ఎకరాల వరిగడ్డి వామి దగ్ధం అయ్యింది. వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన లావుడ్యా బాసు వరిగడ్డిని ఇంటి సమీపంలో వామిగా పెట్టుకున్నాడు. మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని గడ్డివామి దగ్ధం అయ్యింది. ఈ ప్రమాదంలో రైతుకు సుమారు రూ.80వేల ఆస్తినష్టం వాటిల్లింది.

సంక్షిప్త సమాచారం

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కురవి: వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అథ్లెటిక్స్ కోచ్ కరణం సింధూవర్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో వేసవి అథ్లెటిక్స్ క్రీడా శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

సీతారాంనాయక్‌ను గెలిపించాలి

డోర్నకల్: బీజేపీ ఎంపీ అభ్యర్థి ప్రొఫెసర్ సీతారాం నాయక్‌ను గెలిపించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దేవానాయక్ కోరారు. డోర్నకల్ పట్టణంలోని పలు వీధుల్లో బుధవారం ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరిక

పెద్దవంగర: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని గంట్లకుంట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు బందు వెంకన్న, దుర్సోజు హనుమాచారి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ విజయ్‌పాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ముత్యాల పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బందికి వేతనాలు అందించాలి

నెల్లికుదురు: గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలను వెంటనే విడుదల చేసి అందించాలని సీఐటీయూ మండల నాయకుడు ఇస్సంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ బాలరాజుకు సిబ్బందితో కలసి వినతిపత్రం అందించారు.

ఘన నివాళి

కురవి: మండల కేంద్రంలో రేషన్‌డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు పెనుగొండ వీరభద్రప్రసాదరావు బుధవారం అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు జరిగాయి. డీలర్ మృతి తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ హాజరై మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, మండల కార్యదర్శి కరణం రాజన్న, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

పరామర్శ

మరిపెడ రూరల్: మరిపెడ మండలం బావోజీగూడెం గ్రామానికి చెందిన కొంపెల్లి వీరమ్మ (45) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా, అదేవిధంగా మండలంలోని గాలివారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని టీలావత్‌తండాకు చెందిన టీలావత్ వెంకన్న ఇటీవల ప్రమాదవశాత్తు హార్వేస్టర్ కింద పడి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించాడు.

బట్టీ విధానానికి స్వస్తి

డోర్నకల్: చదువుల్లో బట్టీ విధానానికి స్వస్తి చెప్పి ఆలోచన, జ్ఞాపకశక్తి పెరిగే విధంగా చదివిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని సెయింట్ ఆగ్నేస్ పాఠశాల కరస్పాండెంట్ ఆంటోని పసాల తెలిపారు. సెయింట్ ఆగ్నేస్ పాఠశాలలో వంద శాతం ఫలితాలు సాధించడం, ఇద్దరు విద్యార్థులు పది జీపీఏ సాధించడంతో బుధవారం పాఠశాలలో సక్సెస్ మీట్ ఏర్పాటు చేసి విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

మానుకోట రైల్వేస్టేషన్‌లో చైన్ స్నాచింగ్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలో ఓ వృద్ధురాలు మెడలో నుంచి నాలుగు తులాల బంగారు ఆభరణాలను ఓ దుండగుడు అపహరించుకొనిపోయిన సంఘటన బుధవారం మధ్యాహ్నం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. జిల్లాలోని గార్ల మండలం ముల్కనూరు గ్రామానికి చెందిన సోమనబోయిన యశోద తన మనువడికి అనారోగ్యంగా ఉందని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించింది. తిరుగు ప్రయాణంలో యశోద పాత బజారు వైపునకు వెళ్లి బస్సు ఎక్కుదామని నడుచుకుంటూ రైల్వేస్టేషన్ రెండో నంబరు ప్లాట్‌ఫాం రైలు పట్టాలు దాటి ఒకటో నంబరు ప్లాట్‌ఫాం చేరుకుంది. అంతలోనే ఓ గుర్తు తెలియని అగంతకుడు వచ్చి వృద్ధురాలి మెడలో గల రెండు తులాల బంగారు పుస్తెలతాడు, మరో రెండు తులాల నల్లపూసల గొలుసు లాక్కొని పారిపోయాడు. రోదిస్తూ అక్కడే ఉన్న ఆమెను చూసిన స్థానికులు జీఆర్పీ అవుట్ పోస్ట్ వద్దకు తీసుకువెళ్లగా ఫిర్యాదు చేసింది. సమాచారం తెలుసుకున్న ఖమ్మం జీఆర్పీ సీఐ ఏవీ.రావు, స్థానిక జీఆర్పీ ఎస్సై సురేష్ సంఘటన స్థలంలో విచారణ జరిపారు. వారితోపాటు ఆర్పీఎఫ్ ఏఎస్సై వీవీ.రత్నం, హెడ్ కానిస్టేబుల్ నాగిరెడ్డి, పీసీ శోభన్ బాబు పాల్గొన్నారు.

కేసీఆర్ మీటింగ్ వెళ్లి వస్తుండగా ఆటో బోల్తా

పలువురికి గాయాలు

గార్ల: మాజీ సీఎం కేసీఆర్ మీటింగ్‌కు వెళ్లి వస్తున్న ఆటోకు కుక్క అడ్డు రావడంతో ఆటో పల్టీ కొట్టగా ఐదుగురికి తీవ్రగాయాలైన ఘటన ముల్కనూరు గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. మండల కేంద్రమైన గార్ల లోని పుట్టకోట బజారుకు చెందిన 11 మంది ఒకే ఆటోలో మహబూబాబాద్‌లో నిర్వహించిన కేసీఆర్ మీటింగ్‌కు వెళ్లారు. తిరిగి వస్తుండగా ముల్కనూరు గ్రామ సమీపంలో ఆటోకు కుక్క అడ్డం రావడంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న పుట్టకోట బజారుకు చెందిన గాజుల మాధురి, గాజుల అనసూర్య, తోట ఉప్పమ్మ, కొంగ లక్ష్మి, మండ ఐమల తలలకు తీవ్రగాయాలు కావడంతో అదే ఆటోలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాజుల మాధురి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ తరలించారు. స్వల్ప గాయాలైన నాయిని నాగమణి, కొమ్ము రమాదేవి, ఉమలను గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రులను ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ పరామర్శించారు.



గాయపడిన క్షతగాత్రులు

'బీజేపీ, బీఆర్‌ఎస్ లోపాయికారీ ఒప్పందం'



మహబూబాబాద్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీజేపీ, బీఆర్‌ఎస్ లోపాయికారీ ఒప్పందాలతో కాంగ్రెస్ పార్టీపై దాడి చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎన్నికల మేనేజ్మెంట్ కమిటీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని బలరాంనాయక్ నివాసంలో బుధవారం ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత, బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్ ఇద్దరు పాతకాపులేనని, ఆ రెండు పార్టీల మధ్య అవగాహనతోనే పోటీ చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ కుమ్మక్కై హైదరాబాద్ చుట్టుపక్కల మత ఘర్షణలు పెట్టడానికి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మేకల వీరన్నయాదవ్, వెంకటేశ్వర్లు, ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు పుణ్యపుర్తి ఐలయ్య పాల్గొన్నారు.